హైదరాబాద్ వార్త

అక్కడ ఏంజరుగుతోంది..!

-చెరువుల చెంత హైడ్రా 'సిసి కెమెరాలు'
-ఆక్రమణలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన నిఘా
-900ల కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ



హైడ్రా కంట్రోల్‌రూంలో సిసిటివిని పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్ తదితరులు

హైదరాబాద్, మే 11,ప్రభాతవార్త:
చెరువుల పరిరక్షణకు హైడ్రా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. మట్టితో నింపి కబ్జా చేయాలనే ప్రయత్నాలకు చెక్ పెట్టింది. చెరువుల చెంత సీసీటీవీ కెమేరాలు పెట్టి గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వీటిని హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానించింది. నిరంతరం చెరువుల చెంత ఏం జరుగుతుందో తెలుసుకునే వ్యవస్థను హైడ్రా కార్యాలయం నుంచే పర్యవేక్షించేలా ఏర్పాటు చేసింది. సీసీటీవీ కెమేరా నిఘా వ్యవస్థను సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రారంభించారు. చెరువులలో మట్టి పోయకుండా.. ఆక్రమణలు జరగకుండా ఇప్పటికే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లు పర్యవేక్షిస్తున్నాయి. వీటికి తోడు సీసీటీవీ కెమేరా వ్యవస్థ అదనంగా అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. చెరువుల్లో ఎవరైనా నిర్మాణ వ్యర్థాలు వేసినా.. మట్టితో నింపేందుకు ప్రయత్నించినా..కబ్జాలు చేసినా సీసీటీవీ కెమేరాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు హైడ్రాకు లభించింది. హైడ్రా కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం నుంచి మానిటర్లద్వారా నిరంతరం పరిశీలిస్తారు. మట్టిని తెచ్చి పోసిన పక్షంలో ఆవాహనం వివరాలను తెలుసుకోవడంతో పాటు.. అక్కడే ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌ను కూడా అప్రమత్తం చేస్తారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మానిటర్లకు కూడా చెరువుల చెంత హైడ్రా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమేరాలను అనుసంధానం చేశారు. దీంతో నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. ఈకార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఆర్ సుదర్శన్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ సృజన

నార్సింగి, మే 11 ప్రభాతవార్త : మౌళిక వసతుల కల్పనకు పెద్దపీఠ వేస్తున్నామని సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ సృజన పేర్కొన్నారు. సోమవారం నార్సింగి సర్కిల్ మణికొండ డివిజన్ అబ్దుల్ కలాం పార్కులో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పతకాలు అర్హులందరికి దక్కేలా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, జల మండలి అధికారులతో నిత్యం ఈ విషయంపై మాట్లాడడం జరుగుతుందన్నారు. వచ్చే వర్షాకాలంలో వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. రోడ్డు నెంబర్ 10. వద్ద చెక్‌డ్యామ్‌తో బూల్కాపూర్ నాలా పునరుద్ధరణ చేసి వరద నీటిని షేక్‌పేట్ నాలాకు మళ్లించడం వలన పందేన్‌వాగుపై భారం తగ్గుతుందన్నారు. మర్రిచెట్టు రోడ్డులో తొలగించిన బస్ షెల్టర్‌లను తిరిగి ఏర్పాటు చేయాలని, ట్రైల్స్ విల్లాస్ ఎదురుగా బాక్స్ డ్రైన్ కమ్ రోడ్డు, రోడ్డు నెంబర్ 10.బ్రిడ్జి కనెక్టివిటీతో ట్రాఫిక్ సమస్య తగ్గించాలన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం మణికొండ ఉత్తర, తూర్పు సరిహద్దులను ఖరారు చేయాలని కమీషనర్‌ను కోరారు. అనంతరం వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మా కాలనీలో గ్రంథాలయం, వీధి దీపాలు, మొక్కల పెంపకం చేపట్టాలని, ప్లాట్ నెంబర్ 200 నుంచి 205.వరకు సిసి రోడ్డు వేయాలని, గోల్డెన్ టెంపుల్ నుంచి తారామంతి బారాదరి మధ్యలోనే ఆక్రమణలు తొలగించాలని కమీషనర్‌ను కోరారు. వివిధ కాలనీ ప్రతినిధులు తెలిపిన సమస్యలను మున్సిపల్ సిబ్బంది నోట్ చేసుకున్నారు.

ఒక కిచెన్..ఒకే ఫ్యామిలీ

-33 ప్రశ్నలు..10నిమిషాలు
-గ్రేటర్‌లో "హౌజ్ లిస్టింగ్ "సెన్సెస్ షురూ
-ఇండ్లు, కుటుంబసభ్యుల వివరాలు సేకరణ
-క్యూర్‌పరిధిలో 19,868 బ్లాక్‌లు
-21,773మంది ఎన్యూమరేటర్లు
-ఒకొక్కరికి 200నుంచి 300ఇండ్లు కేటాయింపు
-జూన్ 9వరకు కొనసాగనున్న ప్రక్రియ
-వివరాలు గోప్యం: జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

ఎంబిటి నగర్‌లో సెన్సెస్ వివరాలు పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

హైదరాబాద్,మే 11,ప్రభాతవార్త:
భాగ్యనగరంలో జనగణన (సెన్సస్) ప్రక్రియలో అత్యంత కీలకమైన హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్స్‌సోమవారం నుండి అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ భారీ కార్యక్రమంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కీలక వివరాలను వెల్లడించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరవ్యాప్తంగా ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించే ప్రక్రియ మే11 నుంచి జూన్ 9వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగనుందన్నారు. నగర అభివృద్ధిలోఈ గణాంకాలు ఎంతో కీలకమని, అందుకే ప్రతి భవనాన్ని ఈ సర్వేలో భాగం చేస్తున్నామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఈ సర్వే కోసం ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసిందని మొత్తం 19,868 హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లను గుర్తించి వాటి వివరాలు సేకరించడానికి 21,773 మంది ఎన్యూమరేటర్లను, వారికి మార్గనిర్దేశం చేసేందుకు 3,400 మంది సూపర్వైజర్లను రంగంలోకి దించినట్లు తెలిపారు. ప్రతి ఎన్యూమరేటర్ తమకు కేటాయించిన లేఅవుట్ మ్యాప్ ద్వారా సుమారు 200 నుంచి 300 ఇళ్లను సందర్శించాల్సి ఉంటుందన్నారు. సర్వేకు వచ్చే సిబ్బంది తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డులతో వస్తారని, జూన్ ఒకటో తేదీ నాటికి నగరంలో అత్యధిక శాతం సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిషనర్ వివరించారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ ఆర్వీ కర్ణన్ భరోసా ఇచ్చారు. ఎన్యూమరేటర్లు సేకరించే డేటాను కేవలం ప్రభుత్వ అవసరాల కోసం మాత్రమే ఉపయోగిస్తామని, దీనిని ఇతరులకు షేర్ చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. చివరికి సమాచార హక్కు చట్టం ద్వారా గానీ, కోర్టులకు గానీ ఈ డేటాను అందించబోమని ఆయన హామీ ఇచ్చారు. ఈసర్వే ప్రక్రియ అంతా ఎన్యూమరేట్ మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో జరుగుతుందన్నారు. కుటుంబంలో ఎవరైనా ఒక్కరు అందుబాటులో ఉన్నా ఈ వివరాలు అందించవచ్చని, ఒకవేళ ఇంటికి తాళం వేసి ఉంటే ఎన్యూమరేటర్లు మరోసారి వచ్చి వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు.

33ప్రశ్నలు..10నిమిషాలు

ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ సర్వేను అత్యంత సులభంగా నిర్వహించే లా రూపొందించారు. ఇందులో కేవలం 33 ప్రశ్నలు మాత్రమే ఉంటాయని, ఒక్కో ఇంటి వివరాల నమోదుకు సుమారు 10 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని కమిషనర్ వెల్లడించారు. కుటుంబ యజమాని పేరు, ఫోన్ నెంబర్ వంటి ప్రాథమిక వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలని, అనవసరమైన ఇతర వివరాలేవీ అడగబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ సర్వే కేవలం నివాస గృహాలకే పరిమితం కాకుండా కమర్షియల్ భవనాలు, హాస్పిటల్స్, హోటళ్లు, అనాథాశ్రమాలు, కాలేజీ హాస్టళ్లను కూడా కవర్ చేస్తుందన్నారు. జనగణన నిబంధనల ప్రకారం "ఒక కిచెన్ ఒక ఫ్యామిలీ"గా పరిగణిస్తూ అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటివరకు నగరంలో కేవలం 1.27 లక్షల మంది మాత్రమే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్నారని, మిగిలిన వారందరూ ఎన్యూమరేటర్లకు సహకరించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఎంబిటి నగర్‌లో సెన్సెస్‌ను పరిశీలించిన కమిషనర్ ఆర్.వి.కర్ణన్

బంజారాహిల్స్ వార్డులోని ఎంబిటి నగర్‌లో జనాభా గణనను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఏవిధంగా చేస్తున్నారు... యాప్‌లో ఫ్యామిలీ వివరాలు ఎలా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. నెల రోజుల వ్యవధిలో ప్రతి ఇంటికి వెళ్లి, జనాభా వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా సరిగ్గా నమోదు చేయాలని.. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లను కమిషనర్ ఆదేశించారు. జనాభా గణన సిబ్బందికి పూర్తిగా సహకరించాలని జిహెచ్‌ఎంసి సిబ్బందిని ఆదేశించారు. జనాభా గణన అనేది చాలా ముఖ్యమైనదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల రూపకల్పనకు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, అమలుకు ఎంతో అవసరం అని చెప్పారు.

అత్తాపూర్ హత్య కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

-గంజాయి విషయంలో తలెత్తిన వివాదం
- ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

అత్తాపూర్ మే11 ,ప్రభాతవార్త : అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును అత్తాపూర్ పోలీసులు మరియు రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ బృందం సంయుక్తంగా ఛేదించారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను గుర్తించగా, వారిలో ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం...లంగర్ హౌస్‌లోని మెహదీ కాలనీకి చెందిన మహమ్మద్ హుస్సేన్ (24), ఏసీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో మహమ్మద్ హుస్సేన్‌కు నిందితులకు గంజాయి సరఫరా విషయంలో పరిచయం ఉందని గంజాయి కొనుగోలు కోసం నిందితుడు (ఎ1), హుస్సేన్‌కు రూ. 700/ అడ్వాన్స్‌గా చెల్లించాడు. అయితే హుస్సేన్ గంజాయి సరఫరా చేయకపోవడంతో పాటు, ఆ డబ్బును కూడా తిరిగి ఇవ్వకపోవడంతో వీరి మధ్య గొడవలు మొదలయ్యాయి.ఈ క్రమంలో మే 9వ తేదీ రాత్రి పిల్లర్ నంబర్ 223 సమీపంలోని ఖుషీ ఫంక్షన్ హాల్ వద్ద నిందితులు హుస్సేన్‌ను అడ్డగించి దాడి చేశారు. అనంతరం అతడిని మరో ప్రాంతానికి తరలించి అక్కడ మళ్ళీ అక్కడ దాడి చేశారు. చివరకు గాయపడిన హుస్సేన్‌ను ఏజీ కాలేజీ మెయిన్ గేట్ సమీపంలో పడవేసి నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, బాధితుడిని 108 అంబులెన్స్ ద్వారా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సిసిటివి దృశ్యాలు మరియు సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి కొంగళ్ల ప్రశాంత్, మిట్ట జగదీష్, రామ్ రోషన్ యాదవ్, గరుడ తరుణ్ కుమార్, ఆరుకల నిఖిల్, గుల్గులోత్ రాజ్ కుమార్, కపులూరి వెంగల్ రావు అలియాస్ వెంగ మరియు మంకాల ప్రశాంత్ అలియాస్ సోనులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితుల ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోంది.నేరానికి ఉపయోగించిన ఈఓ టివి వాహనం, యాక్టివా (టిజి 08 ఎస్ 4407), ప్యాషన్ మోటార్ సైకిల్ (ఎపి 11ఇ3539) మరియు నిందితుల సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్క రోజులోనే ఈ కేసును ఛేదించినందుకు పోలీసు సిబ్బందిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ అభినందించారు.

హైదరాబాద్ వార్త

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

హైదరాబాద్,మే 11,ప్రభాతవార్త:
ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా సత్వర మే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదన పు కలెక్టర్లు కదిరవన్ పలని , ఇంచార్జ్ డిఆర్ఓ శ్రీధర్ లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీ కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లో ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో పెండింగ్ లో ఉన్నటువంటి దరఖాస్తులపై సమీక్షించి పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని అలాగే పెండింగ్ దరఖాస్తులకు సత్వరమే ఏటీఆర్ ద్వారా రిమార్కులు తెలపాల ని సూచించారు. ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 461అందాయని అందులో హౌసింగ్ శాఖ కు సంబంధించి 376 అర్జీలు, పింఛన్లు 41, రెవిన్యూ శాఖ 18, అలాగే ఇతర శాఖలు 26 అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ డాక్టర్ సురేందర్, జిఎం పరిశ్రమలు పవన్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, సంక్షేమ అధికారులు అక్కేశ్వరరావు, జి ఆశన్న, కోటాజి, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, ఏవో విజయలక్ష్మి వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

నిరుద్యోగ యువత జాబ్ మేళాను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా యువతకు పిలుపునిచ్చారు. సోమవారం తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ఆమె జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత 12 వ తేదీన బంజారా హిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో జిల్లా యువజన క్రీడల శాఖ, పరిశ్రమల శాఖ సౌజన్యంతో చేపట్టనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే యువత పది వేల వరకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు.ఈ జాబ్ మేళాలో120 కంపెనీలు పాల్గొంటున్నాయని నిరుద్యోగ యువత ఇట్టి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది : మంత్రి శ్రీధర్‌బాబు

ఎంపికైన విద్యార్థినిక నియామక పత్రాన్ని అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

హుడాకాంప్లెక్స్,11 మే, ప్రభాతవార్త :
యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఐటీ, ఎలక్ట్రానిక్స్‌అండ్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం యువజన సేవలు, క్రీడల శాఖ అధ్వర్యంలో సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మెగాజాబ్‌మేళాను శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ మెగాజాబ్ మేళాలో 123 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. అయా కంపెనీల విధానాల గురించి యువతకు వివరించారు. యువత అపార అవకాశాలు గల ఉత్పత్తి, సేవా, రవాణ రంగాల్లో నైపుణ్యత పెంచుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీట్ నిరుద్యోగులకు, పరిశ్రమలకు మధ్య వారధిగా ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుండా దాదాపు 4318 మంది ఉద్యోగార్హులు జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 3716 మంది హాజరుకాగా 779 మందిని అయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన వారికి మంత్రి శ్రీధర్‌బాబు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కె.కిరణ్మయి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీయుఎఫ్ఐడిసీ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, డీట్ డైరెక్టర్ జె.రాజేశ్వర్‌రెడ్డి, టాస్క్ సీఇఒ నితిన్‌కుమార్‌రెడ్డిలతో పాటు జిల్లా లోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో పర్యటించిన ఎంఎంసి కమిషనర్

చినరాయుని చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి

అల్వాల్, మే 11 ప్రభాతవార్త:
అల్వాల్‌లో ఎంఎంసి కమీషనర్ సోమవారం పర్యటించారు. చెరువులు, పార్కులు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలు, దోమలు నివారణ చర్యలకు సంబంధించి ఆయా శాఖల యంత్రాంగంతో సోమవారం తనిఖీలు చేపట్టారు. సర్కిల్ డిసి భోగేశ్వర్‌తో పాటుగా ఇంజనీరింగ్, ఎంటమాలజీ ఇతర ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది కమీషనర్ పర్యటనలో ఉన్నారు. ఓల్డ్ అల్వాల్, మచ్చబొల్లారం, ఆనంద్‌రావు నగర్, జానకీ నగర్, సిటిజన్ కాలనీలుతో పర్యటించిన ఆయన స్థానికంగా ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. హైటెన్షన్ రోడ్డు, సిటిజన్ కాలనీ, ఓల్డ్ అల్వాల్ ప్రాంతాలులో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను కమీషనర్ ప్రత్యక్షంగా చూశారు. రోడ్డు విస్తరణలో బాగంగా జీవనోపాది కరువైన చిరు వ్యాపారులకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. తిరుమల ఎన్‌క్లేవ్ పార్కును కమీషనర్ సందర్శించారు. పార్కులోని సౌఖర్యాలు, బాత్‌రూములను పరిశీలించారు. పట్టణంలోని మూడు చెరువులులోని నీటి పరిస్థితి, కాలుష్యం తదితర విషయాలను ఆయన ఆరా తీశారు. మురికి నీరు మళ్ళింపు, గుర్రపు డెక్క ప్రధాన సమస్యలు కాగా వీటిపై దృష్టి కేంద్రీక రించాలని ఆయన అధికారులను ఆదేశించారు. చెరువులు కలుషితం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు అవసరమని ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్దం చేయాలని కోరారు. పట్టణంలోని చినరాయుని చెరువుతో పాటుగా కొత్త చెరువు, మెత్కుల కుంట లను కమీషనర్ సందర్శించారు. దోమల నివార ణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించ డంతో పాటుగా లార్వా నియంత్రణలో బాగంగా చిన రాయుని చెరువులో యాంటీ లార్వా ఆయిల్ బాల్స్ సహజ సిద్దంగా లార్వాను తినే చేపలను కమీషనర్ చెరువులో వదిలారు.మచ్చబొల్లారం ప్రాంతంలో రోడ్డు అక్రమణలుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫి క్‌కు అంతరాయం కలగకుండా అక్రమ దుకాణాలను తొలగించాలని సిబ్బందిని కోరారు.

భారతీయ సంస్కృతిలో వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక స్థానం : గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

జూ పార్కులో జరిగిన సదస్సులో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

చార్మినార్,మే 11 ప్రభాతవార్త : హైదరాబాద్ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో .తెలంగాణ అటవీ శాఖ,భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్తం ఆధ్వర్యంలో సోమవారం షేర్డ్‌డ్రైప్స్ షేర్డ్ ఫ్యూచర్ అన్న అంశంపై బిగ్ క్యాట్స్ సంరక్షణపై అంతర్జాతీయ వర్క్ షాపు జరిగింది.అంతర్జాతీయబిగ్ క్యాట్ అలయన్స్ పరిధిలో పులుల సంరక్షణకు సంబంధించి ప్రపంచ దేశాల మధ్య సహకారం పెంపొందిడంపై సదస్సులో చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మలేషియా ,రష్యా,శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ప్రపంచ వన్యప్రాణి సంరక్షణలో భారత్ నాయకత్వాన్ని ప్రస్తావించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అడవులు,వన్య ప్రాణులు,జీవవైవిధ్య పరిరక్షణకు ప్రభుత్వంకట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిసిసిఎఫ్ వినయ్ కుమార్,పిసిసిఎఫ్ డాక్టర్.సి.సువర్ణ,ఆమెరికా తరుపున హైదరాబాద్ యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్,అటవీ అభివృద్ధి సంస్థ ఎండి సునీత ఎం.భగవత్,జూపార్కు డైరెక్టర్ సునీల్ ఎస్ .హీరామత్,జూ పార్కు క్యూరేటర్ జె.వసంతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పులి పిల్లలను దత్తత తీసుకున్న రాష్ట్ర గవర్నర్

జూపార్కులో జరిగిన ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా తొమ్మిది నెలలు వయస్సు కలిగిన ఇషాన్ మగ పులి,వన్యా ఆడ పులిని దత్తత తీసుకున్నారు.

పంజాగుట్టలో రూ. 15 లక్షల నగదు చోరీ

జూబ్లీహిల్స్, మే 11, ప్రభాతవార్తః బ్యాంకులో డిపాజిట్ చేయడానికి తీసుకెళ్తున్న రూ. 15 లక్షల బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు చోరి చేసుకెళ్లిన సంఘంన పంజాగుట్ట ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. అబిడ్స్‌లోని పార్శీ టెంపుల్ సమీపంలో నివసించే అఫ్షిన్ జడిది ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 8న దేవునాని నరేష్ ఇచ్చిన రూ. 9లక్షలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో, కె. నరేంద్రరావు ఇచ్చిన రూ. 6లక్షలను ఐసిఐసిఐ బ్యాంకులో డిపాజిట్ చేయడానికి అఫ్షిన్ తన హోండా యాక్టివా వాహనం మీద బయలుదేరాడు. పంజాగుట్టలోని గణేష్ స్టాంప్ అండ్ కో దుకాణం వద్ద ఆగిన అఫ్షన్ తన బ్యాగును దుకాణం సమీపంలోని ఒక ప్లాస్టిక్ కుర్చీపై పెట్టాడు. మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో వెనుక వైపు నుండి వచ్చిన అగంతకుడు రూ. 15లక్షలతో ఉన్న బ్యాగును దొంగిలించి అక్కడి నుంచి పారిపోయాడు. తనను వెంబడించినవారే ఈ చోరికి పాల్పడి ఉంటారని అఫ్షన్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

పేదలకు అండగా సిఎంఆర్ఎఫ్ : కొలన్ హన్మంత్ రెడ్డి

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, మే 11, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. చికిత్స ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా, ఆయన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్సల నిమిత్తం ఆర్థిక సాయం మంజూరు చేయించారు. సోమవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి చెక్కులను అందజేశారు. రోడమేస్త్రీ నగర్‌కు చెందిన రఫియా బేగమ్‌కు రూ.35 వేలు, గాజులరామారం వాసులు పెరుమల్ల రవికి రూ.35 వేలు, మొహమ్మద్ రుక్ ఉద్దీన్‌కు రూ.27,500, దుండిగల్‌కు చెందిన గైక్వార్డ్ రాజుకు రూ.54 వేలు, జగద్గిరిగుట్టకు చెందిన ఫాతీమాకు రూ.60 వేలు, సుభాష్ నగర్‌కు చెందిన ముంతాజ్ బేగమ్‌కు రూ.60 వేలు, గాజులరామారం వాసి నేమూరి శ్రీనివాస్ గౌడ్‌కు రూ.37,500, దూలపల్లికి చెందిన హిమ బిందు సురకాంతికి రూ.42 వేలు, కుత్బుల్లాపూర్‌కు చెందిన కమ్మరి బ్రహ్మయ్యకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

చదువు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీలు

విద్యావారోత్స వాల తొలి రోజున ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చాంద్రాయణగుట్ట, మే 11, ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుండి ఈనెల 17వ తేదీ ఆదివారం వరకు విద్యా వారోత్స వాలను నిర్వహిస్తున్నారు. నిర్దేశిత కార్యక్రమం మేరకు పలు ప్రభుత్వ పాఠశాలలో తొలి రోజున సమీప బస్తీలలో ర్యాలీ నిర్వహించారు. చదువు ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. గౌలిపురా లలితాబాగ్ రోడ్డులోని శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన ర్యాలీలో ఆ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఎస్.విజయ భాస్కర్ మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత స్థానాలు సాధ్యమన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే చదువు ఎంతో ముఖ్యమన్నారు. పిల్లలు బడిలో...పెద్దలో పనిలో, చదువు దేశానికి వెలుగు...అని విద్యార్థుల చేసిన నినాదాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం అంజలి కుమారి, ఉపాధ్యాయులు సంధ్య, మధుసూదన్‌రావు, ప్రేమీల, శ్రీదేవి, మంజుల, నవనీత, యాకుబ్, సుధేష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఎకు బెస్ట్ టీమ్ అవార్డు

బెస్ట్ టీమ్ అవార్డు అందుకుంటున్న ఎన్‌బికెఎ అధ్యక్షులు గణేష్ నాయక్, పథకాలు సాధించిన విద్యార్థులు.

చాంద్రాయణగుట్ట, మే 11, ప్రభాతవార్త : సీజన్ 4 సూపర్ గోల్డ్ కరాటే లీగ్ 2026లో పాతబస్తీ ఛత్రినాక శివగంగానగర్, నాయక్ బూడోకాన్ కరాటే అకాడమి (ఎన్‌బికెఎ) విద్యార్థులు 16 బంగారు, 3 రజత పతకాలు సాధించి బెస్ట్ టీమ్ అవార్డును సొంతం చేసుకున్నారు. గురుమడల్ ఆశ్రమంలో ఈనెల 9,10వ తేదీలలో జరిగిన ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో అకాడమికి చెందిన 9 మంది విద్యార్థులు కటా, కుమితే విభాగాలలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారు. ఈ సందర్భంగా అకాడమి అధ్యక్షులు పి.గణేష్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, అంకితాభావం ఈ అవార్డు, పథకాలు సాధించేందుకు దోహదపడ్డాయన్నారు. కరాటే కేవలం ఆత్మరక్షన కోసమే కాదని, వ్యక్తిలో ఆత్మవిశ్వాసం, శారీరక ధృడత్వాన్ని, మానిసక బలాన్ని పెంపొందిస్తాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించేందుకు విద్యార్థులు నిజాయితీ, పట్టుదలతో సాధన చేయాలని సూచించారు.

ప్రెస్ క్లబ్ సభ్యులకు నిమ్స్‌లో 'మాస్టర్ హెల్త్ చెకప్'

-మంత్రి దామోదర్ రాజనరసింహ హామీ

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్, ఉపాధ్యక్షులు అరుణ తదితరులు

హైదరాబాద్,మే 11,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్స వాల్లో భాగంగా నిమ్స్ లో ప్రెస్ క్లబ్ సభ్యులు అందరికి మాస్టర్ హెల్త్ చెకప్ చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరి సోమవారం నాడు సచివాలయంలోమంత్రి దామోదర్ రాజ నరసింహకు ఒక వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ ఆవిర్భావ వారోత్స వాల్లో భాగంగా త్వరలోనే నిమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించడానికి అధికారులను ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఈ స్పెషల్ డ్రైవ్ లో మాస్టర్ హెల్త్ చెకప్ ఉచితంగానే చేస్తామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేసుకోవాలని మంత్రి సూచించారు. నిమ్స్‌లో అవసరమైన ఏర్పాటు చేయాలని దామోదర్ రాజనర్సింహ రాష్ట్రఆరోగ్య విభాగం కార్యదర్శి క్రిస్టినాను ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ క్యాంపు క్యాంపు ఏర్పాటుకు అంగీకరించడం పట్ల ప్రెస్ క్లబ్ పాలకమండలి మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది.

కేంద్ర మంత్రి బండి సంజయ్ భేషరతుగా రాజీనామా చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత నగేష్ ముదిరాజ్

ఇందిరాపార్కు, ధర్నాచౌక్‌లో

ముషీరాబాద్, మే 11, ప్రభాతవార్త: కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, మైనర్ బాలిక పట్ల ప్రవర్తించిన తీరు దారుణమని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ భేషరతుగా, బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత నగేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు, ధర్నాచౌక్ లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండి భగీరత్ పోక్సో చట్టం కింద కేసు నమోదు అయినప్పటికీ, దానిని హని ట్రాప్‌గా కేసును నిర్వీర్యం చేశారని వస్తున్న ఆరోపణలు వస్తున్నప్పటికీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్పందించకపోవటం విచారకరమన్నారు. మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన భగీరథ్‌ను ఇప్పటి వరకు అరెస్ట్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే సమగ్ర విచారణ జరిపి, బాధ్యుడైన బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సాయిరాం, దినేష్, రమేష్, సాయికిరణ్, కన్నా పాల్గొన్నారు.

సైబరాబాద్ కమిషనరేట్ ముందు...

గచ్చిబౌలి, మే 11 ప్రభాతవార్త : మైనర్ బాలిక మీద అఘాయిత్యం చేసి, పోక్సో కేసు నమోదైన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ మీద వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు సోమవారం సైబరాబాద్ కమీషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమీషనరేట్ ముందు బిఆర్ఎస్ నాయకురాలు తుల ఉమా మాట్లాడుతూ తమ బిడ్డకు అన్యాయం జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసి 48 గంటలు గడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బాధితురాలికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ ..ప్రభుత్వం స్పందించి బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయడంతో పాటు బాధితురాలికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాళ్లు, సీనియర్ నాయకులు ఉన్నారు.

కార్వాన్ డివిజన్ పార్టీ కార్యాలయంలో

కార్వాన్,మే11,ప్రభాతవార్త : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయిభగీరథ్ పై పోక్సో కేసు నమోదు చెయ్యాలని బీ.ఆర్.ఎస్ పార్టీ కార్వాన్ నియోజక వర్గం ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భముగా కార్వాన్ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని,లేనిపక్షంలో కేంద్ర మంత్రివర్గం నుండి ఆయన్ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజక వర్గం అధ్యక్షురాలు అనిత,సురేఖ,ముత్యాల భాస్కర్,రఘు, దుర్గరాజ్,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో

కంటోన్మెంట్,మే 11 ప్రభాతవార్త: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని,అదే విధంగా బండి సంజయ్‌ని మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్,కంటోన్మెంట్ ఉద్యమ నేత గజ్జెల నాగేష్ డిమాండ్ చేశారు. సోమవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగీరథ్‌పై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు రావుల సతీష్,రాజు,పనస సంతోష్, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

సైబరాబాద్ కమిషనరేట్ ముందు నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ మహిళా విభాగం

రాంనగర్ చౌరస్తాలో

చిక్కడపల్లి మే 11 (ప్రభాతవార్త) : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మండిపడ్డారు. సోమవారం రాంనగర్ చౌరస్తా లో స్థానిక బిఆర్ఎస్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆ పార్టీ యువనేత ముఠా జయసింహ, సీనియర్ నాయకు లు ముఠా నరేష్, గోక నవీన్, వెల్లంకి ఇంద్రసేన రెడ్డి, అస్లాం, ఖదీర్, డీన్ దయాల్ రెడ్డి, ముదిగొండ మురళి, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ఎం.రాకేష్ తదితరులు పాల్గొన్నా రు.బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదై నా అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశా రు. రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాధి త కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో బాధి తుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని స్పష్టం చేశారు.

మహిళలు బాగుపడితేనే సమాజం అభివృద్ధి : జస్టిస్ డా. రాధారాణి

నాంపల్లి, మే 11 ప్రభాతవార్త : సమాజంలో బాగుపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర కన్స్యూమర్స్ డిస్పూట్స్ రిడ్రెసెల్ కమిషన్ మహిళా అధ్యక్షురాలు జస్టిస్ డా. జి.రాధారాణి అన్నారు. అమృతలత వివిధరంగాల్లోని మహిళల ప్రతిభాపాటవాలను గుర్తించి అవార్డులతో ప్రోత్సహించడం హర్షదాయకమని పురస్కార గ్రహీతలను అభినందించారు. ప్రముఖ రచయిత్రి, అపురూప అవార్డుల వ్యవస్థాపకురాలు డా. అమృతలత అధ్యక్షోపన్యాసంలో అవార్డుల నేపథ్యాన్ని సవివరపరిచి అందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. పురస్కార గ్రహీతలకు శుభాభినందనలు తెలిపారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం రోజున వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళామణులను పురస్కారాలతో సత్కరించడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో డా. అమృతలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ డా. జి.రాధారాణి విశిష్ట అతిథి ప్రముఖ సినీనటి, ప్రఖ్యాత నాట్యకారిణి మంజుభార్గవి, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవిలతో కలిసి హైమవతి భీమన్న, డా. పెళ్ళకూరు జయప్రద, బుర్రా వరహాలులను ఘనంగా సత్కరించి జ్ఞాపికతోపాటు అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు; ఎం.కె.ఆర్.ఆశాలత, పి.నాగలక్ష్మి, వేపులపల్లి వాణీదేవి, డా. మైథిలి, డా. టి.శ్రీదేవిరెడ్డి, భావరాజు పద్మినీప్రియదర్శిని, అంజలి, ఎస్.మాధవి, గంగలను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, అమృతలత అపురూప అవార్డులను ప్రధానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.రాధారాణి చేతులమీదుగా అవార్డు గ్రహీతల వివరాలతో కూడిన అభినందన సావనీర్‌ను ఆవిష్కరించారు.

అవార్డు గ్రహీతలతో జస్టిస్ జి.రాధారాణి, మంజుభార్గవి, అమృతలత, రమాదేవి తదితర అతిథులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

-మధుసూదనాచారి, ఈటల, శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

హైదరాబాద్, మే 11 ప్రభాతవార్త

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నడుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించకుండా ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చైర్మన్ పులి లక్ష్మయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కాచి గూడలో కుల సంఘాలు, బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, హాజరైనారు. అనంతరం మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి దళారుల పట్ల ప్రేమ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై లేదని, దళారుల వ్యవస్థను తొలగించాలని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నడి రోడ్డుపై ఉద్యమాలు చేస్తేనే ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కారిస్తాయని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలతో ప్రభుత్వం చెలగాటం అడోద్దని, వారికి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామిని నేరవేర్చి, ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, అందుకు సమానంగా వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు చెల్లించాలని పేర్కొన్నారు. ఎజెన్సీలను రద్దు చేసి నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలోకి వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు అగమ్యగోచరంగా మారిందని, ఉద్యోగులకు వెట్టిచాకిరి తప్ప న్యాయం చేయడం లేదని ఆరోపించారు. ఇది అరంభం కాదని, అంతిమ లక్ష్యంగా ఉద్యోగులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిక్కుడు ప్రభాకర్, వేముల రామకృష్ణ, పృద్వీరాజ్ యాదవ్, బక్క జడ్సన్, శ్రీధర్, శ్రీనివాస్, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జరిగిన సమావేశంలో మధుసూదనాచారి, ఈటల, శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

ఫోక్సోకేసు విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే బండి రిజైన్ చేయాలి : దీపక్ జాన్

సికింద్రాబాద్, మే 11 ప్రభాతవార్త: దేశం కోసం, ధర్మం కోసం అంటూ నిత్యం ప్రగల్బాలు పలికే బీజేపీ నాయకుల అసలు రంగు బయటపడిందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ జాన్ విమర్శించారు. పద్మారావునగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బీజేపీ మౌనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మైనర్ బాలికను స్నేహం పేరుతో పలుమార్లు ఫామ్ హౌస్‌కు రప్పించి, కూల్ డ్రింక్స్‌లో మత్తు మందు కలిపి అత్యాచారానికి పాల్పడినట్లు వస్తున్న వార్తలపై కమలనాథులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. బాధితురాలు హిందూ బాలిక అయినప్పటికీ, సొంత పార్టీ నేత కుమారుడు నిందితుడు కావడంతోనే బీజేపీ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందని ఆయన మండిపడ్డారు.కంచే చేను మేసిన చందంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర మంత్రి కుమారుడే ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడటం సిగ్గుచేటని దీపక్ జాన్ ధ్వజమెత్తారు. ఈ దారుణానికి బండి సంజయ్ నైతిక బాధ్యత వహించాలని, సమాజం పట్ల బీజేపీకి కనీస బాధ్యత ఉంటే వెంటనే ఆయన్ని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌కు నిజంగానే నీతి, నిజాయితీ ఉంటే విచారణ పూర్తయ్యే వరకు తన ఎంపీ, మంత్రి పదవులకు రాజీనామా చేయాలని సూచించారు. అప్పుడే కేసు విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగుతుందని, బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ జాన్

భారతీయ సంస్కృతిలో వివాహ బంధానికి ఎంతో ప్రాముఖ్యం



చిక్కడపల్లి మే 11 (ప్రభాతవార్త): భారతీయ సంస్కృతిలో వివాహ బంధానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ప్రవాసీ సెల్ బిజెపి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శ్రీ సుభాష్ అగర్వాల్, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎంకే రాము అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో కె.వి.కె. ఫైన్ ఆర్ట్స్ అండ్ మెలోడీస్" ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కుప్పా వెంకట కృష్ణ మోహన్, కె. పద్మజ ఆధ్వర్యంలో గానలహరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రసమయి సంస్థ ఎం కె రాముఎంకెఆర్ ఆశాలత దంపతులను, కూచిపూడి నృత్యగురువు డాక్టర్ భాగవతుల సేతురాంలక్ష్మి కనకదుర్గ, ఆధ్యాత్మికవేత్త జంధ్యాల వెంకటేశ్వర్లు హేమలత , కౌత పద్మభ శర్మకె.బాలాత్రిపుర సుందరి, గాయకుడు బొడ్డుపల్లి శ్రీధర్ చెంచు లక్ష్మి, భాగవతుల రమణభాగవతుల కుసుమ దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వరసారధ్యంలో గాయని గాయకులూ స్వప్న, శ్రీదేవి, జయలలిత, ఎం.నీరజ, స్వరకల్యాణి, రమణ రెడ్డి, బి.శ్రీధర్, ఎస్ వి .రమణ తదితరులు అద్భుతంగా గానం చేసారు. కార్యక్రమంలో మాజీ సైనికాధికారి కల్నల్ డాక్టర్ శ్రీనగేష్, సంఘసేవకుడు బి.ఖుద్దూస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనల్లో సామ్యవాదం, సంస్కరణ కాంక్ష

చిక్కడపల్లి మే 11 (ప్రభాతవార్త) : ఏ కులజుడైన నేమి ఎవ్వడైన నేమి.. అందరికీ శ్రీహరే అంతరాత్మ" అంటూ వేల సంవత్సరాల క్రితమే సమభావాన్ని బోధించిన అన్నమయ్య సాహిత్యంలో సామ్యవాదం, సంస్కరణ కాంక్ష మెండుగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు కె.వి. రమణాచారి పేర్కొన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ముంబై అన్నమయ్య కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో అన్నమాచార్య ట్రస్ట్ స్థాపకులు బి.ఎ.వి. శాండిల్య సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కెవి.రమణాచారి ప్రసంగిస్తూ శాండిల్య ముంబై, అమెరికా వంటి ప్రాంతాల్లో అన్నమయ్య కీర్తనల ప్రచారానికి విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, బాల గంధర్వం సంస్థ గురువు రామాచారి శిష్య బృందం అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా గానం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

రైతులను మోసం చేసే యత్నం ...నిషేధిత పత్తి విత్తనాల స్వాధీనం

నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్న నిషేధిత బీటీ 3 పత్తి విత్తనాలు

నేరేడ్‌మెట్,మల్కాజిగిరి కమిషనరేట్, మే 11: ప్రభాతవార్త. రైతులను నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలతో మోసం చేసి అక్రమ లాభాలు ఆర్జించాలన్న యత్నాన్ని మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భగ్నం చేశారు. షామీర్‌పేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 100 కిలోల నిషేధిత బీటీ3 (బీజీ III హెచ్‌పీ వెరైటీ) పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.ఎస్‌వోటీ కంటోన్మెంట్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, షామీర్‌పేట్ పోలీసులతో కలిసి శనివారం సాయంత్రం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.7 సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా, రెండు సంచుల్లో నిషేధిత బీటీ3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. మొత్తం 100 కిలోల విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా చెబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు (58) ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా అతడు తన సహచరుడు దాసరి సూరిబాబుతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద తక్కువ ధరకే విత్తనాలు కొనుగోలు చేసి, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైతులు, ఎరువుల దుకాణాలకు అధిక ధరల కు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు.ఇదే తరహా కేసులో గతంలో వికారాబాద్ జిల్లా యాలాల్ పోలీస్టేషన్ పరిధిలో కూడా నిందితుడిపై కేసు నమోదైందని అధికారులు పేర్కొన్నారు. నిషేధిత, నకిలీ విత్తనాల వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గడం, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు.ఈ ఘటనపై షామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అలరించిన హాయి హాయిగా ఆమని సాగే సంగీత విభావరి

గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త: సంగీత ప్రియులను విశేషంగా అలరిస్తూ హాయి హాయిగా ఆమని సాగే సంగీత విభావరి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎంఈ గ్రాండ్ లో శారద, సీతారామ్ దంపతుల నిర్వహణలో, శ్రీలక్ష్మి, అమర్‌నాథ్‌ల సమర్పణలో శారద సురాగాలు సీజన్ 3 పేరుతో జరిగిన సంగీత కార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా అలరించింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో అనేక మంది గాయనీ గాయకులు ఉత్సాహంగా పాటలు పాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాజ్ఞిక ఆర్ట్స్ ఛీఫ్ అడ్వైజర్ ప్రవీణ్, పారిజాత, గంగోత్రి, ఈవెంట్ ఫౌండర్ త్రినాథ్, క్లాసికల్ మ్యూజిక్ గురువు తాడేపల్లి సాయిప్రసాద్, ప్లేబాక్ సింగర్ సుజాత హాజరయ్యారు. అనంతరం గాయనీ, గాయకులను శాలువాలతో, మెమెంటోలతో ఘనంగా సత్కరించి, మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.

అన్యాయానికి గురైన సర్పంచ్‌లకు న్యాయం జరిగేలా చూస్తా

సికింద్రాబాద్, మే 11 ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ద్వారా అన్యాయానికి గురైన సర్పంచ్‌లకు తగిన న్యాయం జరిగేలా చూస్తానని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ట్రిబ్యునల్ మెంబర్ నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండిలో ఆయన విలేకరులో మాట్లాడుతూ న్యాయవాదిగా దశాబ్దాల కాలంగా పని చేస్తున్నానని, సర్పంచ్‌లు అవినీతికి పాల్పడినా, అన్యాయానికి గురైనా తనవంతు సహాయం చేస్తానన్నారు. ప్రభుత్వానికి మచ్చరాకుండా తన విధులను నిర్వహిస్తానన్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాటు ఇతర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

జానపద కళలు మన సంస్కృతికి నిలువుటద్దాలు

బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

చిక్కడపల్లి, మే 11,ప్రభాతవార్త :

జానపద కళలు తెలుగు సంస్కృతికి నిలువుటద్దాలని, వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదిక లో గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళాకారులచే బుర్ర కథ సప్తాహంలో ముఖ్య అతిథిగా కొల్లేటి దామోదర్ గుప్తా పాల్గొని లక్ష్మి సన్యాసం అంశంపై అద్భుతంగా బుర్రకథను వినిపించిన ఎడ్ల ప్రేమేందర్ ను సత్కరించి మాట్లాడుతూ సాంకేతికత పెరిగిన నేటి కాలంలోనూ బుర్రకథ వంటి కళారూపాలకు ఆదరణ తగ్గలేదని, ఇలాంటి సప్తాహాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నేత నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడంలో త్యాగరాయ గానసభ ముందుండటం సంతోషకరమని అన్నారు.సప్తాహంలో భాగంగా ఎడ్ల ప్రేమేందర్ బృందం ప్రదర్శించిన "లక్ష్మీ సన్యాసం" బుర్రకథ ఆద్యంతం అద్భుతంగా సాగింది. తన వాగ్ధాటితో, అభినయంతో ప్రేమేందర్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల రికవరీ ఏజెంట్ హత్య కేసులో ముగ్గురు అరెస్టు

-24 గంటల్లోనే కేసును ఛేదించిన బాలాపూర్ పోలీసులు

సరూర్‌నగర్, మే 11 ప్రభాతవార్త: బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుని హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సోమవారం సాయంత్రం బాలాపూర్ పిఎస్‌లో ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి హత్య కేసు, నిందితుల అరెస్టు, రి మాండ్ తదితర వివరాలను వెల్లడించారు. వాహనాల రికవరీ ఏజెంట్‌గా పని చేసే కుర్మల్‌గూడ ఇందిరానగర్‌లో నివసిస్తున్న ఉత్తరప్రదేశ్ లక్నోకు చెందిన ఆదిత్ పాండే అలియాస్ భజరంగ్ (24)ను వృత్తిపరమైన విషయంలో కక్ష పెట్టుకున్న షాహీన్ నగర్ నివాసి సయ్యద్ ఇఫ్తెకార్ అలియాస్ మున్నా (25) అంతమొందించాలని నిర్ణయించాడు. ఈ నేపథ్యంలో సహచరులైన తన ప్రాంతానికి చెందిన మహ్మద్ సాహిల్ (20), బార్కాస్‌కు చెందిన అబ్దుల్లా బిన్ ఉమర్ (20)లతో కలిసి పథకం పన్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మాట్లాడుకుందామని ముగ్గురూ ఆదిత్ పాండేను వెంటబెట్టుకొని కర్మన్ ఘాట్ వైపు తీసుకెళ్ళి మద్యం తాగారు. అనంతరం అదే రోజు రాత్రి వెంకటా పూర్ బురాన్‌ఖాన్ చెరువు సమీపంలోని ఉస్మాన్‌నగర్‌కు వచ్చి నిర్మా నుష్యంగా ఉన్న ప్రదేశంలో కర్రలు, రాళ్ళు, రాడ్‌తో దాడి చేసి అంత మొందించారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న ఇన్స్‌పెక్టర్ సుధాకర్, సెక్టార్ ఎస్ఐ ప్రసాద్‌లు సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేసి కేవలం 24 గంటల లోపే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితులకు డ్రగ్ పరీక్షలు జరపగా పాజిటివ్ వచ్చింది. దీంతో హత్య కేసుతో పాటు డ్రగ్స్ కేసును కూడా నమోదు చేసి సోమవారం సాయంత్రం రిమాండ్‌కు పంపారు. హత్య కేసు మిస్ట రీని ఛేదించి గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసిన ఇన్స్‌పెక్టర్ సుధాకర్, సెక్టార్ ఎస్ఐ ప్రసాద్‌లను ఎసిపి అభినం దించారు. ఈ మేరకు రివార్డు కోసం సిఫారసు చేసినట్లు వెల్లడించారు.

పెళ్లికి వెళ్లివచ్చేసరికి ఇళ్లు లూటీ

హైదరాబాద్, మే 11 ప్రభాతవార్త : దొంగలు ఒక ఇంట్లోకి చొరబడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. కుటుంబమంతా ఇంటికి తాళమేసి పెళ్లికి వెళ్లారు. తిరిగొచ్చే సరికి..దొంగలు తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేశారు. తమ ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా పెట్టుకున్న దొంగలు ఆ ఇంట్లోకి చొరబడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. జైన్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు భారీగా బంగారం, వెండి, నగదును అపహరించుకెళ్లారు. తన బంధువుల పెళ్లికి ఆదివారం ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగుల గొట్టబడినట్లు బాధితుడు గుర్తించాడు.ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 30 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు తెలిసింది. బాధితుడు వెంటనే గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. గోశామహల్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగల కోసం గాలింపు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముషీరాబాద్, మే 11, ప్రభాతవార్త: అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్‌లో నివసించే వికాస్‌కరన్ (55), భార్య వర్షా కరన్‌తో విభేదాలు రావటంతో ఒంటరిగా ఉంటున్నాడు. వికాస్ కరన్ తన ఇంటిపై వచ్చే అద్దెలు తీసుకుంటూ, ఉద్యోగం చేయకుండా, మద్యానికి బానిసయ్యాడు. భార్య వర్షాకరన్ ఇద్దరు పిల్లలతో కలసి అంబర్‌పేట్‌లో నివసిస్తూ ఉండగా, ఆదివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని ఇంట్లో అద్దెకు ఉండే వారు ఫోన్ చేసి, వికాస్ కరన్ పడిపోయి ఉన్నాడని తెలియచేశారు. వెంటనే హిమాయత్‌నగర్ ఇంటికి వచ్చిన వర్షాకరన్ 100కు ఫోన్ చేసి, పోలీసులకు సమాచారం అందించి, ఉడ్‌లాండ్ హాస్పటల్ డాక్టర్‌కు ఫోన్ చేసి, పిలిపించారు. డాక్టర్ వచ్చి, వికాస్‌ను పరీక్షించి, రెండు రోజుల క్రితమే మరణించినట్లు ధృవీకరించారు. తన భర్తకు ఆస్థుల వ్యవహారంలో గొడవలు ఉన్న నేపథ్యంలో, భర్త హఠాన్మరణంపై అనుమానం ఉందని వర్షాకరన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వర్షాకరన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

శక్తికి, పరాక్రమానికి ప్రతీక పంచముఖ హనుమాన్ : ఎమ్మెల్యే కెపి

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, మే 11, ప్రభాతవార్త

125 గాజులరామారం డివిజన్ మహాదేవపురం శ్రీశ్రీశ్రీ షిర్డీ సాయి బాబా దేవాలయంలో నిర్వహించిన పంచముఖ హనుమాన్, నవగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య ఆతిథిగా హాజరై పంచముఖ హనుమాన్ ప్రతిష్టాపన ప్రత్యేక పూజలు గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తికి, పరాక్రమానికి ప్రతీక పంచముఖ హనుమాన్ అని, పంచముఖి హనుమాన్ స్వామి వారి ఆశీస్సులు భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుగ్యాల సాయి ప్రసాద్, రవీందర్ రెడ్డి, సింహాచలం, ప్రభాకర్ రెడ్డి, నవీన్, రంగారావు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్, ఇమ్రాన్ బేగ్, ముసా ఖాన్, బోయిని మహేష్, చిన్నా చౌదరి, సాయిబాబా, రాములు గౌడ్, నవీన్, మహేష్, శ్రావణ్, ప్రసాద్, శివా నాయక్ పాల్గొన్నారు.

నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలి : ఆకుల సతీష్

నిజాంపేట్, మే 11, ప్రభాతవార్త

నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌పై వచ్చిన అవినీతి, అక్రమాలు, విధుల నిర్లక్ష్య ఆరోపణల నేపథ్యంలో ఆయనను తక్షణమే బదిలీ చేసి సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. 2023 ఆగస్టులో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, పార్కుల్లో నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించకుండా అక్కడ రూ. 3.5 కోట్ల బిల్లుల చెల్లింపుల కోసం కమిషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో నాసిరకం పనులు, బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు, అక్రమ హోల్డింగ్లు, టీఎస్ బీపాస్ ఇన్‌స్టంట్ అనుమతుల పేరుతో సుమారు 150 అక్రమ అంతస్తుల నిర్మాణాలకు వసూళ్లు జరిగినట్లు ఆరోపించారు. గత ఏడాది నవంబర్‌లో నిజాంపేట్ సర్కిల్ కమిషనర్‌ను తొలగించాలని ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించినప్పటికీ అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు. అనంతరం నిజాంపేట్ సర్కిల్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమయ్యే సమయంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు నివేదికను బహిర్గతం చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో పూర్తి ఆధారాలతో సోమవారం సృజనకు ఫిర్యాదు చేసినట్లు ఆకుల సతీష్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్‌ని వెంటనే బదిలీ చేసి, అన్ని ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, అంకం సతీష్, పండు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

వెస్ట్ మారేడ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా వారోత్సవాల ప్రారంభమ అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,మే 11 ప్రభాతవార్త: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతినప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసం గించారు. కళాశాల అభివృద్ధికి,విద్యార్థులకు అవసరమైన తరగతి గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ముందుగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.భాగ్యలక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నేతలు సంతోష్ యాదవ్, చిర్రబోయిన వైష్ణవి యాదవ్, సి.సంతోష్ యాదవ్,బద్రి యాదవ్,అల్లాడి గౌరి శంకర్,నందికంటి రవి నాగేశ్ యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా రేణుకను వ్యతిరేకించడం దుర్మార్గం

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ మంజులా

సైఫాబాద్, మే 11 ప్రభాతవార్త: వడ్డెర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుకానారాయణ నియామకాన్ని వ్యతిరేకించడం దుర్మార్గమని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని తగిన బుద్ధిచెపుతామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మంజులా హెచ్చరించారు. రేణుకానారాయణను చైర్మన్‌గా నియమించినందుకు ఆయన సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు కుంచపు రామా, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాపెన గిరిబాబు, నాయకులు ఎం.హనుమంతు, డి.కృష్ణతో కలిసి రమేష్ మాట్లాడుతూ దివంగత సిఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వడ్డెర కులస్తులు ఎంతో వెనుకబడి ఉన్నారని గుర్తించి వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం రుణాల మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం వడ్డెర ఫెడరేషన్‌కు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, పేదలకు విశేషమైన సేవలు అందించిన రేణుకానారాయణకు ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన వడ్డెర కుల ద్రోహులు కొంతమంది ఆమె నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఫెడరేషన్‌కు ఎందుకు నిధులు కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. వడ్డెర జాతి కాంగ్రెస్ పార్టీ వెనుకాలే ఉందని, భవిష్యత్తులో కూడా ఉంటుందని రమేష్ స్పష్టం చేశారు.

తల్లిని ప్రతిరోజూ గౌరవించుకోవాలి : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, మే 11, ప్రభాతవార్త:

తన ప్రాణాలను పణంగా పెట్టి మనకు జన్మనిచ్చిన తల్లిని ప్రతిరోజూ గౌరవించుకోవాలని, అప్పుడే మన జన్మకు సార్థకత కలుగుతుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం బల్కంపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మాతృదినోత్సవం సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గర్భిణీ మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు చీరలు, పండ్లు, స్వీట్లు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ లేకపోతే మనం లేమనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని 150 మంది గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రోజా రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డిలను అభినందించారు. తల్లి నవమాసాలు గర్భంలో మోసి జన్మనివ్వడమే కాకుండా పిల్లలను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో కష్టాలు పడుతుందని చెప్పారు. తల్లి-బిడ్డల బంధం ఎంతో గొప్పదని, త్యాగం, ప్రేమకు ప్రతీకగా నిలిచే మాతృమూర్తిని ఎంత గౌరవించినా తక్కువేనని పేర్కొన్నారు.నేటి తరానికి తల్లి విలువ, మన సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన తగ్గిపోతుండడం బాధాకరమని అన్నారు. పండుగల

సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

విశిష్టత, భారతీయ ఆచార సంప్రదాయాల గురించి పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాలు కూడా భారతీయ సంప్రదాయాలను గొప్పగా భావిస్తూ ఆచరిస్తున్నాయని చెప్పారు.గర్భిణీలు తమ ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సరైన ఆహారం తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారికి కేసీఆర్ కిట్ ద్వారా తల్లి, శిశువుకు అవసరమైన వస్తువులు అందించడంతో పాటు ఆడబిడ్డ పుడితే రూ.13 వేల, మగబిడ్డ పుడితే రూ.12 వేల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్ పంపిణీ నిలిపివేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, రోజా రెడ్డి, నాగలక్ష్మి, కావేరి, నీరా గుప్త, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నామన సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేసిన బిజెపి కార్యకర్తలకు అభినందనలు : ఈటల

కంటోన్మెంట్,మే 11 ప్రభాతవార్త:

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న నిర్వహించిన ప్రధాని మోదీ బహిరంగ సభ కనీ,వినీ ఎరుగని రీతిలో విజయవంతంగా జరిగినందుకు అందుకు సహకరించిన బిజెపి నాయకులు,కార్యకర్తలకు అభినందనలు తెలుపుతున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. సోమవారం డైమాండ్ పాయింట్‌లోని గాయిత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలోని మల్కాజిగిరి, మేడ్చెల్,సికింద్రాబాద్,రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా మోదీ సభకు రావడంతో విజయవంతమైందన్నారు. ఈ సభకు మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పెద్ద సంఖ్యలో తలివచ్చారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ గడ్డమీద బిజెపి అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందర్

ప్రజా సమస్యలు పట్టించుకునే ఏకైక పార్టీ బిజెపి అన్నారు. మోదీ 3వ సారి ప్రధాని అయ్యాక ప్రతి రాష్ట్రంలో బిజెపి అధికారంలో వచ్చేందుకు విస్తరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద, మహంకాలి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్. శ్రీనివాస్, నాయకులు బానుక మల్లికార్జున్, చెన్నారావ్, విశాలిని, విజయానంద్, సుబ్బారావ్, కట్ట కుమార్, పద్మ, ఆర్.కె.శ్రీనివాస్,గిరి, బానుప్రకాష్ పాల్గొన్నారు.

కళ్యణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అల్వాల్, మే 11 ప్రభాతవార్త: మహిళలకు సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం అల్వాల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులు అందరికి పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, ఎమ్మార్వో రాములు బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, నరేందర్ రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం గంగావతరణం కూచిపూడి దృశ్యరూపకం

రవీంద్రభారతి, మే 11 ప్రభాతవార్త :

మహాఋషి. జ్ఞాని, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి సీతా కళ్యాణం కోసం 1976లో ఆయన కలం నుండి జాలువారిన కళాభండం గంగావతరణం కూచిపూడి దృశ్యరూపకం నయనానందంగా ప్రదర్శింపబడి గొప్ప అనుభూతిని కల్గించి భక్తిపారవశ్యంలో ముంచెత్తివేసిందని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య సూర్య ధనుంజయ్ అన్నారు. భువి నుండి దివికి దిగివచ్చిన గంగను, శివుడుని, భగీరథుడ్ని ఈ రోజు గంగావతరణం కూచిపూడి దృశ్యరూపకం ద్వారా చూడగలిగామన్నారు. నేడు కావ్యేశు నాటకం రమ్యం, రమణీయమైందని, మనకు ప్రత్యక్ష అనుభవం కలిగించిందని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించిందని కొనియాడారు. ప్రదర్శనలో పాల్గొన్న నర్తకీమణులందరికీ అభినందనలు తెలిపారు. నృత్యకిన్నెర ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో నేత్రపర్వంగా ప్రదర్శింపబడిన గంగావతరణం కూచిపూడి దృశ్యరూపకం సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య సూర్య ధనుంజయ్ విశిష్ట అతిథులు డా. జుర్రు చెన్నయ్య, మద్దాళి రఘురామ్, ఉషాగాయత్రి, సౌందర్య కౌశిక్ తదితరులతో కలిసి మద్దాళి సౌందర్యతోపాటు ముఖ్య పాత్రల్లో పరమశివుడుగా శ్రద్ధ, భగీరథుడుగా సమిత, నంది పాత్రలలో మాన్విత, లక్ష్య, సహస్ర, రుత్వికలు తమ నృత్యాభినయంతో తన్మయుల్ని చేసిన కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

సిటీ కళాశాల దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థ

విద్యా వారోత్సవ ప్రారంభ సభలో పాల్గొన్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ

చార్మినార్,మే 11 ప్రభాతవార్త : పాతబస్తీలో ఉన్న ప్రభుత్వ సిటీ కళాశాల దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థ అని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో సోమవారం జరిగిన విద్యా వారోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ నేను సిటీ కళాశాలలో చదువుకున్నానని,సిటీ కళాశాల అభివృద్ధికి అన్ని విధాల తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు.విద్యా వారోత్సవాల బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ ప్రసాద్,పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి పి.అనంత మోహన్,వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.శాంతి,డాక్టర్ రాజేంద్రకుమార్,కళాశాల ఐక్యాయేసి కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ నీరజ జివ్వాజీ,అడ్మిని స్ట్రేటర్ ఆఫీసర్ మాదవి పాల్గొన్నారు.

చిన్నారుల కోసం రోడ్డు భద్రతపై వేసవి శిబిరం

గోషామహల్,మే11(ప్రభాతవార్త)

గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత వేసవి శిబిరం2026 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు డి.జోయల్ డేవిస్,ఐపిఎస్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భముగా మాట్లాడుతూ.. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో 10నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని రూపొందించామన్నారు.ఇందులో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతో పాటు ప్రాథమిక చికిత్స, నృత్యం,సంగీతం,చిత్రలేఖనం,చేతి వ్రాత మెరుగుదల,వ్యక్తిత్వ వికాసం,అగ్నిమాపక భద్రత వంటి వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.చిన్నారులకు చిన్నతనం నుండే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను,ప్రాణనష్టాన్ని తగ్గించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.ఈ ఏడాది మొత్తం 100 మంది చిన్నారులు ఈ శిబిరంలో పేరు నమోదు చేసుకున్నారని వివరించారుగొప్ప కలలు కని,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,దేశం గర్వించేలా ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ పలువురు విజేతల జీవితాలను ఉదాహరణలతో విద్యార్థులవివరించారు.ఇక్కడ నేర్చుకున్న రోడ్డు భద్రత నియమాలను మీ తల్లిదండ్రులకు,స్నేహితులకు,బంధువులకు వివరించి,మీరు సమాజంలో ట్రాఫిక్ రాయబారులుగా మారాలి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ 2డి.సి.పి.కాజల్ సింగ్,హోండా గ్రూప్ జి.ఎమ్.చతుర్వేది,ఆర్యన్ డాన్స్ అకాడమీ సరోజ్ బాలా,రాజ్ ఈవెంట్స్ అనంత్ రాజ్ తదితర శిక్షకులు,అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులతో జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్,

హన్‌మాన్ మాల ఇరుముడి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కంటోన్మెంట్,మే 11 ప్రభాతవార్త: తుకారాంగేట్ పహాడి హన్‌మాన్ దేవాలయంలో సోమవారం నిర్వహించిన మాల ఇరుముడి మహోత్సవ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల పాటు మాల ధరించి ఇరుముడితో కొండ గట్టుకు వెళ్తున్న స్వాములకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

చెరువుల్లోకి మురికి నీరు చేరకుండా చర్యలు తీసుకోండి

అల్వాల్, మే 11 ప్రభాతవార్త: చెరువులలోకి మురికి నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ నేతలు డిసికి వినతి పత్రం అందించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం సర్కిల్ కార్యాలయంలో డిసి భోగేశ్వర్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు కలవడం జరిగింది. పట్టణంలోని మూడు చెరువులలోకి ప్రతి ఏడాది గుర్రపు డెక్క తొలగిస్తున్నా మరలా మురికి నీరు కారణంగా వేగంగా పెరుగుతోందన్నారు. రీసైక్లింగ్ ప్రక్రియను చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు.బిజెపి నేతలు వినతికి డిసి సానుకూలంగా స్పందించి శాస్వత పరిష్కారంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, S Mariya, S/o Sadapuram Ramulu, Residing at Musheerabad, Hyd, have changed my name to Sadapuram Roshan. Hereafter, I shall be known as Sadapuram Roshan for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, MMC

ర్.నం.1, నిట్ నం. 10/MMC/2026-27, తేది: 08.05.2026

పని వరిధి: మల్కాజ్‌గిరి జోన్ వివిధ సర్కిల్‌లో క్రీడల సౌకర్యాల అభివృద్ధికి డిజైన్‌లు, ప్లాన్స్, ఎస్టిమేట్స్, BOQs, టెండర్ డాక్యుమెంట్స్, డిజైన్ పర్యవేక్షణ కలిపి DPR తయారీలకు కన్సల్టెంట్ నియామకం కొరకు ప్రతిపాదనకు అభ్యర్థన. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ & సమయం: RFP బిడ్ ధాలు ప్రారంభం (తేదీ & సమయం): 11.05.2026 మ. 1.00 గం. బిడ్ ధాలు చివరి తేదీ: 18.05.2026 మ.1.00 గం. వద్ద కార్యాలయం పేరు, చిరునామా: సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, MMC, సెల్ నం: 9154796465.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, MMC

DIPR.No.2226-PP/CL/Advt/1/2026-27, తేది: 11.05.2026

IN THE COURT OF THE HON'BLE XVII ADDL. SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
O.S. No. 06 OF 2026

BETWEEN:
Shaik Idris Ahmed
...Plaintiff
AND
Syed Sami
...Defendant

To,
Mr. Syed Sami, S/o. Syed Chand Pasha, R/o. H. No. 13-5-431/A/116, Mahboob Colony, Karwan, Hyderabad-500006.

NOTICE

It is submitted that you are the sole Defendant in the above suit. The Hon'ble Court was pleased to order for the publication of this Notice for your appearance in the above Suit. The matter is posted on 23-06-2026 at 10:30 am. Therefore, you may appear before the Hon'ble Court either in person or through your counsel, failing which the matter will be decided in your absence.

Hence, this Notice.

//BY ORDER OF THE HON'BLE COURT//
Vinod Kethepally, Vamsi,
Advocates
Flat No-107, Gayatri Nest Apt., Telecom Nagar, Gachibowli, Hyderabad - 500 032.
Cell : 9959 69 0989

నేడు నాగోల్‌లో శ్రీసువర్చల సహిత హనుమాన్ జయంతోత్సవం

ఎల్.బి.నగర్, మే 11 ప్రభాతవార్త:
నాగోలు గ్రామంలోని శ్రీసీతారామచంద్ర, శ్రీఆంజనేయస్వామివారి దేవాలయంలో శ్రీసువర్చల సహిత హనుమాన్ జయంతోత్స వం 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్స వ వేడుకలు మంగళవారం నిర్వహి స్తున్నట్లు దేవాలయం డైరెక్టర్ కొలను చంద్రశేఖర్‌ఆజాద్ పేర్కొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుంద న్నారు. దేవాలయం పాలకమండలి పర్యవేక్షణలో నాగభూషణం భక్త సమాజం వారితో భజనలు, ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంద న్నారు. దేవాలయంలో జరిగే కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

కాలనీ సమస్య పరిష్కరించాలని జెడ్‌సికి వినతి

జోనల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మే 11 ప్రభాతవార్త:
కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వివిధ కాలనీలా సంక్షేమ సంఘాల అసోసియేషన్ సభ్యులతో సోమవారం ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను కలిసి శాలువాతో సన్మానించి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దానికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అల్కాపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంశీ, సైదయ్య, శ్రీరా మకృష్ణాపురం ఐటిడిఈఎస్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు బి.వెంకటే శ్వర్లు, రాజేశ్రీరామారావు, సౌభాగ్యపురంకాలనీ సంక్షేమ సంఘం ప్ర ధానకార్యదర్శి నరసింహరెడ్డి, కోశాధికారి కృష్ణమూర్తి, టెలిఫోన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏలిమినేటి సంజీవరెడ్డి, సుబ్బారావు, మహిపాల్‌రెడ్డి, మార్గదర్శికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రాములు, ఇందిరానగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంగోపాల్, కోశాధికారి రాధాకృష్ణ, వాసవికాలనీ వాసులు గ్రంథి రమేష్, కోలుకులపల్లి గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : చెకోలేకర్ శ్రీనివాస్

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, మే 11, ప్రభాతవార్త: కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమ ని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నా రు. మలక్ పేట నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి పొ న్నం ప్రభాకర్ తో భేటీ అయి పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాల తో సన్మానించి పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా చెకోలేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గం సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడా నికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజల గురించి వారికి అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి

: డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ

మలక్ పేట పల్టాన్‌లో జనగణన కార్యక్రమాన్ని చేపడుతున్న మలక్ పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇంకే షాఫ్ అలీ తదితరులు

మలక్ పేట, మే 11, ప్రభాతవార్త:
జనగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని మలక్ పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ పేర్కొన్నారు. మలక్ పేట సర్కిల్ పరిధిలోని అక్బర్ బాగ్ డివిజన్ పల్టాన్ లో సిబ్బందితో కలిసి జనగణన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్ పేట సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో జనగ ణన కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభం అయిందని తెలిపా రు. జనగణన కార్యక్రమం జూన్ 9వ తెది వరకు కొనసాగుతుందని వివరించారు. జనగణన కోసం వచ్చే సిబ్బందికీ ఇంటి బిల్డింగ్ నెంబ రు, ఇంటి నేల, గోడ,లు పై కప్పు యొక్క పదార్థాలు, ఇంటి యొ క్క వినియోగ (నిర్ధారణ/ నివాసితం కానిది) ఇంటి యొక్క పరిస్థితి, ఉపయోగించే ఆహార ధాన్యాలు, జనాభా లెక్కల సమాచారం కోసం మొబైల్ నెంబర్ అందజేయాలని కోరారు. అదేవిధంగా కుటుంబం గురించి ప్రాథమిక సమాచారం, సౌకర్యాలు తదితర వాటి గురించి తెలియజేయాలని పేర్కొన్నారు.

సమాజ సేవకు కృషి చేయడం అభినందనీయం

నిర్వాహకులను సన్మానిస్తున్న పవన్‌కుమార్

ఎల్.బి.నగర్, మే 11 ప్రభాతవార్త:
సమాజ సేవ చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న సీనియర్ సిటిజన్ల సేవలు అభినందనీయమని కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరే టర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ పరిధి లోని మారుతీనగర్‌లోని శ్రీరామ భక్త సమాజంలో నూతనంగా ఏర్పా టు చేసిన లిఫ్ట్‌ను పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామభక్త సమాజం అనేది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందన్నారు. ప్రతిరోజూ పెద్దసంఖ్యలో భక్తులు, వృద్ధులు, మహిళలు వస్తుంటారని, వారికి సౌకర్యవంతంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యాల కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో శ్రీరామభక్త సమాజ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొర్రూర్‌లో వైభవంగా బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం

-పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్ మే11,ప్రభాతవార్త
గ్రామీణ సంస్కృతికి బీరప్ప ఉత్స వాలు ప్రతీకలని తరతరా ల సంప్రదాయాలను కాపాడుకోవాల్సి న బాధ్యత అందరిపై ఉందని మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బీరప్ప ఉత్స వాల్లో భాగంగా సోమవారం బీరప్పకామరతి కళ్యాణం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి హాజరై కళ్యాణం కనులారా వీక్షించి, స్వామివారి ఆశీస్సు లు తీసు కుని, మొక్కులు సమర్పించారు. ఆధునిక కాలంలో జానప ద కళలు అంతరించిపోకుండా, తమ వారసత్వాన్ని కొనసా గిస్తున్న ఒగ్గు కళాకారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. బీరప్ప స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించా రు. ఆలయ అభివృద్ధి, కురుమల సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తానని మల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే రంగారెడ్డిని ఘనంగా

సన్మానించారు. భక్తుల సౌకర్యార్థం గ్రామం నుంచి ఆల యం వరకు రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. వేడుకల వేళ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకు మార్, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, మాజీ కౌన్సిలర్లు కాకుమాను సునీల్, మేతరి దర్శన్, నక్క శివలింగం గౌడ్, వంగేటి గోపాల్ రెడ్డి, గుండ్ల అర్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

కార్మికుల సంక్షేమం కోసం ఐఎన్‌టియుసి నిరంతర పోరాటం : డాక్టర్ హౌశిలా ప్రసాద్ శర్మ

సైదాబాద్, మే 11 ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమం కోసం ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఫెడరేషన్) నిరంతర పోరాటం చేస్తుందని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హౌశిలా ప్రసాద్ శర్మ అన్నారు. లింగోజిగూడలో జరిగిన తెలంగాణ ఐఎన్‌టియుసి(ఫెడరేషన్) రాష్ట్ర కమిటి నియామ కానికి టిఎఫ్‌టియు అధ్యక్షులు కాచం సత్యనారాయణ, ఐఎ న్‌టియుసి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సయ్యద్ ముర్షిద్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ హౌశిలా ప్రసాద్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం కార్మిక వర్గం అనేక సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. కనీస వేతన చట్టాలను కఠినంగా అమలు చేయాలని, కాంట్రాక్ట్, అసంఘటిత కార్మికులను సామాజిక భద్రత పథకాలతో అనుసంధానం చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్, వైద్య సదుపాయాలను సమర్థవంతంగా అమలు చేయాలని, మహిళా కార్మికులకు భద్రత, హక్కులకు రక్షణ కల్పించా లని, పరిశ్రమలు ఉన్న చోట కార్మిక సహాయ, న్యాయ మార్గదర్శక కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మార్గదర్శక కార్యక్రమాలు చేపట్టా లని ఆయన కోరారు. ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన బిజ్జల రామకృష్ణారెడ్డి, సీనియ ర్ జనరల్ సెక్రటరీగా ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తాలు మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఐఎన్‌టియుసి ఫెడరేషన్‌ను బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్ర

నూతనంగా నియమితులైన రాష్ట్ర కమిటీతో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హౌశిలా ప్రసాద్ శర్మ

మంలో మహిళా విభాగం జాతీయ చైర్మన్ భవాని త్రివేది, నాయకులు సందీప్, బాలరాజు, కొండల్, రాజు, వెంకటే ష్, శ్రీకాంత్‌రెడ్డి, అనురాధ, రమేష్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన ఐఎన్‌టియుసి ఫెడరేషన్ ప్రతిని ధులు పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గం.....

ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బిజ్జల రామకృ ష్ణారెడ్డి, సీనియర్ జనరల్ సెక్రటరీగా ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కృష్ణారెడ్డి, కోడుమూరు దయాకర్, అశోక్ కుమార్, మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్న, సెక్రటరీలుగా గడ్డం శ్రీనివాస్, జిల్లా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా అశోక్ చారి, బిజ్జుల దీక్షిత్ రెడ్డి, శివరాజ్ నియమితులయ్యారు.

రూ.కోటి 48లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్, మే 11 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్‌లో రూ. కోటి 48 లక్షలతో వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఉప్పల్ బీరప్పగడ్డ, చిలుకాన గర్‌లలో చేపడుతున్న సిసి రోడ్లు, స్టామ్ వాటర్ డ్రైన్ పనులతోపాటు, భూగర్భ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరే టర్ బన్నాల గీత ప్రవీణ్, సీనియర్ నేత పసుల ప్రభా కర్‌రెడ్డి తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లైన్ పనులతోపాటు, వర్షపు నీటి కోసం స్ట్రామ్ వాటర్ డ్రైన్ ట్రంక్ లైన్లు, సిసి రోడ్లు చేపడుతున్నామని తెలిపారు. దశల వారిగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ బ్యాంక్ కాలనీలో ఆటో స్టాండ్ నుండి ఫణి మెడికల్ షాప్ వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్, ఆటో స్టాండ్ నుండి వార్డు కార్యాలయం వరకు సిసి రోడ్ల పనులు చేపడుతున్నామని తెలిపారు. సాయిరాం నగర్ కాలనీలో డ్రైనేజ్ పైప్ లైన్ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముది రాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, వి.బి నరసిం

చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల గీత తదితరులు

హ, జల్లి మోహన్, బాలకృష్ణ, ఎం. శ్రీనివాస్ యాదవ్, మాస శేఖర్, రామాంజనేయులు, శ్యాం బంటి, ఒబేద్ పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సత్కారం :

చిలుకానగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. ఇటీవల విడుద ల అయిన పదో తరగతి పరీక్షలతో పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బన్నాల గీత, ప్రిన్సిపల్ అంజి రెడ్డి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పట్ల అధికారుల అలసత్వం తగదు

-మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, మే 11 ప్రభాతవార్త: అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధికారులు అలసత్వ ధోరణితో ఉండకూడదని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సూచించారు. నియోజకవర్గం లోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్-16 కిందకు వచ్చే జిల్లెలగూడ మిథిలానగర్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డిపి నాలా పనులు సోమవారం ప్రారంభమయ్యా యి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, పలు వురు అధికారులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులతో కలిసి నాలా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎన్‌డిపి నాలాకు సంబంధించిన పను లపై అధికారులతో అక్కడే సమీక్షించి దిశా నిర్దేశనం చేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ వచ్చే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలా పనులను వేగవంతం చేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా పర్యవేక్షిం చి అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించా రు. నాలా నిర్మాణపు పనుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించమనీ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మిథిలానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ

జిల్లెలగూడ మిథిలానగర్‌లో అసంపూర్తి ఎస్ఎన్‌డిపి పనులకు శ్రీకారం చుట్టిన సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో కాలనీ అధ్యక్షుడు విజయసింహారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు, కాలనీవాసులు, అధికారులు, నాయకులు ఉన్నారు.

సింహారెడ్డి, మాజీ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రశాంత్, సభ్యులు ఫణిరాజు, శ్రీనివాస్‌రెడ్డి, భరణి, కృష్ణ య్య, భూమయ్య, గురు ప్రసాద్, దయాకర్‌రెడ్డి, మోహన్, గంగారామ్, చారి, ప్రకాశ్, రామ్మోహన్, మహిళలు హారతి, సోమశిల, బాల, సుప్రియ తదితరులతో పాటు పాత మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, అర్కల కామేష్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, మాదరి రమేష్, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, సుర్వి లత శేఖర్‌గౌడ్, పంతంగి మాధవి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఫిన్ స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలు

అత్తాపూర్ మే11, ప్రభాతవార్త : బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో 3వ ఫిన్ స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ , ఆక్వా బిగినర్ టాలెంట్ హంట్ ఫెస్టివల్ ఉత్సాహభరితంగా కొనసాగింది. శివరాంపల్లి బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో ఫిన్‌స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ కమ్‌జాతీయ ఎంపిక ట్రయల్స్‌తో పాటు ట్విన్ సిటీ ఆక్వా ఫెస్టివల్ బిగినర్ టాలెంట్ హంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుండి 150 మందికి పైగా ఈతగాళ్లు పాల్గొని, ఛాంపియ న్‌షిప్‌లో పోటాపోటి పడ్డారు. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరి చిన ఈతగాళ్లకు జరుగబోయే జాతీయ స్థాయి ఫిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. రాధిక ఐపిఎస్ మాట్లాడుతూ జల క్రీడలను ప్రోత్సహించడం వల్ల యువత లోని ప్రతిభను పెంపొందించడానికి దోహదం చేస్తుంద న్నారు. ఈ పోటీల్లో బొడుప్పల్లోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్కు చెందిన విద్యార్థి పిఎం రుత్విక్ బంగారు పతకాన్ని సొంతం చేసుకు న్నారు. కార్యక్రమంలో బ్లూ డాల్ఫిన్ స్విమ్ క్లబ్ వ్యవస్థాపకుడు దినేష్ రాజోరియా ,సర్దార్ భాషా పట్టన్, శివాషు రాయ్, క్లబ్ అధ్యక్షురాలు జ్యోతి, కోచ్ జగన్ రావు పాల్గొన్నారు.

16న శివరాంపల్లిలో హిందూ సమ్మేళనం

అత్తాపూర్ మే11 ,ప్రభాతవార్త : హిందూ ధర్మం విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హిందూ సమ్మేళనం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 16న శివరాంపల్లిలో నిర్వహించే హిందూ సమ్మేళ నానికి సంబంధించిన పోస్టర్ ను హిందూ సమ్మేళ నం కమిటీ సభ్యులు పలువురితో కలిసి ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హిందూ సనాతన ధర్మం,సాంస్కృతి,విలువలను కాపాడుకోవలిసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హిందూ సంస్కృతి వైభవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో శివరాంపల్లిలోని ఊర చెరువు బుధవారం మార్కెట్ (గ్రౌండ్స్)లో శనివారం సాయంత్రం నిర్వ హించే హిందూ సమ్మేళనానికి పెద్దఎత్తున హిందూ బంధువులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ కమిటీ సభ్యులు,స్థానిక పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు

: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి మే 11,ప్రభాతవార్త :
బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధి లోని గోపాల్ నగర్ కమిటీ హాల్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజ కవర్గం లోని అన్ని డివిజన్లో బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటులకు కృషి చేస్తున్నామన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు కార్యకర్తలు కమిటీ ఏర్పా ట్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నంది కంటి శ్రీధర్, గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్, మేకల రాము యాదవ్, మ ల్కాజ్గిరి నియోజకవర్గ కమిటీ ప్రతినిధులు జేపీసీ వెంక న్న, మహమ్మద్ ఖలీల్, రావుల అంజయ్య, పరశు రాంరెడ్డి వీరేశం యాదవ్, బైరు అనిల్,కృష్ణ గౌడ్,సిద్ధి రాములు,రామచర్ల నర్సింగ్,మర్రి శీను,హబీబ్, సిహెచ్ వెంకట్, భరత్, సిద్ధులు, సుధామ తదితరులున్నారు.

సైదాబాద్‌లో హిందూ సమ్మేళనం

హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

సైదాబాద్, మే 11 ప్రభాతవార్త: సైదాబాద్‌లోని శ్రీ సు దర్శన లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం హిందు సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్యన అతిథి గా ప్రముఖ జ్యోతిష్యులు బ్రహ్మశ్రీ డాక్టర్ భమిడిపాటి రవికృష్ణ శర్మ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది స్వర్ణలతా రెడ్డి, విద్యావేత్త ఎడుదొడ్ల మల్లి కార్జున రెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, దేవాలయ చైర్మన్ డాక్టర్ కొండపల్లి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గుడి మధుసూధన్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మే 11 ప్రభాతవార్త : చిలుకానగర్‌లోని చిలకే శ్వర గుట్టపై వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అభయాంజనేయ స్వామి జ యంతి ఉత్స వాలు అంగరంగ వైభవంగా నిర్వహించా రు. ఆలయ ధర్మకర్త గుడి స్వర్ణ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ లు నిర్వహించారు. ఆలయం విద్యుద్దీపాలతో ప్రకాశవం తంగా అలంకరించారు. భజనలు, మంగళ వాయిద్యా లు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఉత్స వాలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధ్యాత్మిక వాతా వరణంలో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మిక వేడుకలు భక్తులలో ఆనందాన్ని పంచాయి. ఈ మహోత్స వాలకు ముఖ్య అతిధులుగా హజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ మల్కా జిగిరి పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్వామి వారి దయతో చిలుకానగర్ ప్రజలు ఆనందోత్స వాలతో ఉండాలని ఆకాక్షించారు. అనంతరం ఆలయంలో ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా విద్యా వారోత్సవాలు



ఉప్పల్ డిగ్రీ కళాశాలలో జరిగిన విద్యా వారోత్స వాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్ తదితరులు

ఉప్పల్, మే 11 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్స వాలు నిర్వహిం చారు. ఉత్స వాల్లో భాగంగా సోమవారం ఉప్పల్ ఎమ్మె ల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో మే 11 నుండి 17 వరకు విద్యా వారోత్స వాలు నిర్వహిస్తున్నా రని తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వారోత్స వాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్య, సాంస్కృతికం, క్రీడలు, సామాజిక అవగాహన వంటి విభిన్న అంశాలపై నిర్వహించే పోటీలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తా యని తెలిపారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబ డి ఉందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చి న విద్యార్థులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి రూ.18 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాధికారి రామరావు, అశోక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్, విశ్వనాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మే 11 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఉప్పల్ నియోజకవర్గానికి అధికంగా నిధులు కేటాయించారని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నా రు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ అసెంబ్లీ పరిధిలోని ప్రభు త్వ పాఠశాలలకు నిధులు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఉప్పల్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని, ఉప్పల్ నియోజకవర్గానికి రూ.కోట్లాది నిధులను తెస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, కుషాయిగూడ జిల్లా పరిషత్ ప్ర భుత్వ పాఠశాలలు అప్‌గ్రేడ్ కోసం రూ.37.10 కోట్ల నిధులను మంజూరు చేయించినట్టుగా చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే సాధ్యం అయిందన్నారు. ప్రతిపక్ష నేతలు ఎంత ప్రచారం చేసుకున్నా, ఎన్ని రకాల మాయమాటలు చెప్పిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌రెడ్డి నమ్ముతారని తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, కంది ఆగి రెడ్డి, ఎం.డి.తౌఫిక్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్, ఎం.డి.రఫీక్, విజయ్, రాజేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు బి. సుధాకర్ రెడ్డి, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, బజారు జగన్నాథ్ గౌడ్, కొంపల్లి బాలరాజ్, ఈగ ఆంజనేయులు, శ్రవణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకారపు అరుణ్, బ్లాక్ సెల్ అధ్యక్షులు కాంగ్రెస్ లింగంపల్లి రామకృష్ణ, బ్లాక్ అధ్యక్షురాలు అమరేశ్వరి, ప్రకాష్ రెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

విద్యా విలువలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

నేరెడ్ మెట్ , మే 11,ప్రభాతవార్త :
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్స వాలను ఘనంగా ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బండి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు కళాశాల అభివృద్ధి, విద్యా నాణ్యత పెంపుపై తమ సూచనలు వెల్లడించా రు. ఈ సందర్భంగా ఆచార్య బండి రాజు మాట్లాడుతూ కళాశాల ను తెలంగాణలో ఉత్తమ విద్యా విలువలు కలిగిన సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత విద్యాసంవత్స రంలో కళాశాల భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లు సాధించా మని, అలాగే మలబార్, అజిం ప్రేమ్‌జీ, సిద్ధివినాయక యువజ న మండలి యూఎస్ఏ వంటి సంస్థల నుంచి సిఎస్ఆర్ నిధులు సమీకరించి విద్యార్థుల సంక్షేమానికి వినియోగిస్తున్నట్లు పేర్కొ న్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో కళాశా ల కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. డా. వెంకట్ రెడ్డి కళాశాల వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించగా, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ స్వాతి మహిళా సాధి కారతపై దృష్టి సారించాలని తెలిపారు. సీనియర్ ఫ్యాకల్టీ డా. మల్లిక గత కార్యక్రమాల లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్ అధ్యాప కుల కృషితోనే కళాశాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొ న్నారు. డా. బ్రిజేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన అకాడమిక్ అల్మనాక్ అమలుపై దృష్టి పెట్టాలని సూచించగా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. రాజేశ్ కుమార్ నాణ్యమైన, నైపుణ్యాధారిత వి ద్యపై ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. అడవి రాజు మౌలిక వసతుల సమస్యలను సమిష్టిగా అధిగమిం చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశేష సేవలందించిన డా. అహల్య, డా. మీనయ్యలను సత్కరించారు. డా. జి.ఎన్. జగన్ వ్యాఖ్యా తగా వ్యవహరించగా, డా. హరిత వందన సమర్పణ చేశారు.

జనగణనను పారదర్శకతతో సమర్థవంతంగా నిర్వహించాలి

శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ

బడంగ్‌పేట్ సర్కిల్‌లో జన గణన ప్రక్రియను పరిశీలిస్తున్న శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ

సరూర్‌నగర్, మే 11 ప్రభాతవార్త: జన గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ పిలుపునిచ్చారు. జన గణన సోమవారం నుండి ప్రారంభమైన నేపథ్యంలో ఆమె బడంగ్‌పేట్ సర్కిల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక డిప్యూటీ కమీష నర్ సమ్మయ్యతో పాటు పలువురితో కలిసి జన గణన ప్రక్రియ ను పరిశీలించారు. ఇందులో భాగంగా ఆమె ఇంటింటికి తిరిగి జన గణన నమోదు చేస్తున్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల పని తీరును పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. అదే విధంగా ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జడ్‌సి మాట్లాడుతూ జోనల్ పరిధిలోని అన్ని సర్కిళ్ళల్లో జన గణన పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలి పారు. డిప్యూటీ కమీషనర్లు, సంబంధిత అధికారులు ప్రతి రో జూ జన గణనపై పర్యవేక్షణ జరపాలని ఆమె సూచించారు. పారదర్శకంగా సమర్థవంతంగా ప్రక్రియ సాగేలా చూడాలని అన్నారు. ప్రజలు తమ ఇళ్ళ వద్దకు వచ్చే జన గణన ఎన్యూ మరేటర్లకు సహకరించి వాస్తవమైన వివరాలను అందజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమీష నర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా వారోత్సవాలు ప్రారంభం


విద్యా వారోత్స వాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ డిసి సమ్మయ్య

సరూర్‌నగర్, మే 11 ప్రభాతవార్త: ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమ వారం బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 17వ తేదీ వరకు జరిగే ఈ వారోత్స వాలకు ముఖ్య అతిథిగా హాజరైన బడం గ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులతో కలిసి విద్యా వారోత్స వాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు, విద్యా వారోత్స వాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ముఖ్యులు డాక్టర్ రామరాజు, వెంకట్‌రెడ్డి, డాక్టర్ జ్యోతి, నరసింహరాజ్, డాక్టర్ రేవతి, డాక్టర్ కిరణ్మయి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.